**కథ**

**మీద ఫ్యాన్లు తిరుగుతున్నా ఒకటే ఉక్కపోత! బయట వర్షం పడుతూండడం వల్ల కిటికీ అద్దాలన్నీ మూసివేసి వున్నాయి. సమయానికి చేరగలడో లేదోననే ఆందోళన ఒక వైపూ, ఇంటర్వ్యూలో ఏమేం ప్రశ్నలు వేస్తారోననే కంగారు మరోవైపూ- మండూకవర్ధన రావులో గుండె దడ పెంచేస్తున్నాయి.**

ట్రాక్ రిపేరులో ఉన్నట్టుంది. ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ అయినా నత్తనడక నడుస్తోంది.

'ఛీ! దిక్కుమాలిన ట్రెయిన్. ప్రతీ స్టేషన్లో ఆగుతుందేమిటి? తను అసలు నిన్న సాయంత్రమే బయలుదేరవలసింది. రాత్రంతా విశ్రాంతి తీసుకుని ఉదయం ఫ్రెష్‌గా తయారై ఇంటర్వ్యూకి వెళ్లేవాడు' తనలో తనే విసుక్కుంటున్నాడు మండూకవర్ధనరావు.

'బండి లేటవడం, చిటచిటలాడుతూ వర్షం- జరగబోయే దానికి అపశకునాలా?' మనసేదో కీడు శంకిస్తోంది.

'తను బాగానే ప్రిపేర్ అయ్యాడు. ఇంకా తనకి సమాధానాలు తెలియని అడ్డమైన ప్రశ్నలేవో వేసి తనని ఫెయిల్ చేసేస్తారా? కెరీర్లో ఇంత వరకూ ఓటమి ఎరుగని తనకి ఈసారి ప్రమోషన్ హుళక్కేనా? తనకి కచ్చితంగా ప్రమోషన్ వచ్చితీరుతుంది అని ఆశిస్తున్న మిత్రబృందానికి ముఖం ఎలా చూపించగలడు ఇంటర్వ్యూలో సెలక్టు రాకపోతే? అత్త కొట్టినందుకు కాకపోయినా తోడికోడలు నవ్వినందుకు కలిగిన బాధలా ఉండదూ?' అంతులేని ఆలోచనలతో సతమతమవుతున్నాడు.

ముఖ్యమైన టాపిక్స్ మరొక్కసారి చూసుకుందామని నోట్‌బుక్ తెరిచాడు. అబ్బే! అక్షరాల పంక్తులని కళ్లు చదువుతున్నాయి కానీ పంక్తులలోని పదార్థమేదీ బుర్రకెక్కడం లేదు. పుస్తకం మూసేసి వాచీ చూసుకున్నాడు. మరో గంటలో ఇంటర్వ్యూ బోర్డు సభ్యుల ముందుండాలి. చేరగలడో లేడో? బయట వర్షం ఉధృతమవుతోంది. తగ్గే సూచనలేవీ కనిపించడం లేదు. పొద్దున్నే వచ్చిన వర్షం, పొద్దుకూకిన తర్వాత వచ్చిన చుట్టం- ఒక పట్టాన వదల రట!

టీసీ వచ్చాడు.

"జనరల్ టిక్కెట్టుతో స్లీపర్ కోచ్ ఎక్కారు. పెనాల్టీ కట్టాలి" అన్నాడు.

"అలాగా! ఎంత కట్టాలో చెప్పండి" అన్నాడు మండూకవర్ధనరావు.

కొంతసేపు ఏవో లెక్కలు కట్టి, "రాయాలంటే నూట యాభై అవుతుంది" అన్నాడు టీసీ. 'రాయాలంటే' అనే మాటని వత్తి పలుకుతూ.

"రాయక్కరలేకపోతే?" అన్నాడు మండూకవర్ధనరావు కుతూహలంగా.

"యాభై ఇచ్చేయండి"

"పర్వాలేదు. రాసివ్వండి" అని నూటయాభై రూపాయలిచ్చాడు టీసీనోసారి నిరసనగా చూసి.

అతని వైపోసారి ఏవగింపుగా చూసి రిసీట్ కట్ చేసి ఇచ్చాడు టీసీ.

"వైజాగ్ చేరడానికి ఇంకా ఎంత టైం పడుతుంది?" రిసీట్ అందుకుంటూ అడిగాడు మ.వ.రావు.

"మరో అరగంట" అన్న టీసీ మాటల్తో అతనిలోని ఆరాటం కాస్త తగ్గింది.

# తృప్తి

అరగంటలో చేరుతుందన్న ట్రెయిన్ అదనంగా మరో అరగంట తీసుకుని విశాఖ చేరింది. ఆదరాబాదరాగా ఆటో చేయించుకుని ఆఫీసు చేరుకునేసరికి పావుగంట ఆలస్యం అయింది.

హైదరాబాదు నుంచి వచ్చే ఫ్లయిట్ లేటవడం వల్ల ఇంటర్వ్యూ బోర్డు చెయిర్‌మేన్ రావడం ఆలస్యం అయిందట. అందువలన ఇంటర్వ్యూలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. లిస్టులో అతని పేరు పన్నెండోది! ఇంకా రెండో కేండిడేట్ ఇంటర్వ్యూ జరుగుతోంది. హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు మ.వ.రావు.

ఆరోజు ఇంటర్వ్యూ ఉన్నవాళ్లంతా జట్లు జట్లుగా కూర్చుని తాము ప్రిపేర్ అయిన టాపిక్స్ మళ్లీ మళ్లీ చర్చించుకుంటున్నారు. అందరి ముఖాల్లోనూ టెన్షన్! ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని బయటకు రాగానే ఆ కేండిడేట్ చుట్టూ చేరి లోపల ఏమేం ప్రశ్నలడిగారో అడిగి తెలుసుకుంటున్నారు. ఆ ప్రశ్నలకి సమాధానాలు తెలిసినవారు సరదాపడిపోతున్నారు. తెలియని వాళ్లు పుస్తకాలు తెరిచి ఆ టాపిక్స్ చూసుకుంటున్నారు. మ.వ.రావు ఇవన్నీ గమనిస్తూ డోర్‌కెదురుగా కూర్చున్నాడు వీలైనంత నిబ్బరంగా ఉండడానికి ప్రయత్నం చేస్తూ. అతనికి పిలుపు రాగానే లేచి నిలబడ్డాడు. ఇంత వరకూ అడిగిన ప్రశ్నలు తనకి తెలిసినవే! కనుక తను ధైర్యంగా ఇంటర్వ్యూ ఎదుర్కోవచ్చు అనుకున్నాడు హాలులోకి వెళుతూ.

ఇంటర్వ్యూ బోర్డు సభ్యులు ముగ్గురినీ చిరునవ్వుతో గ్రీట్ చేసి వాళ్లు కూర్చోమనగానే వాళ్లకెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"నీ పేరు?" ఒకతను అడిగాడు.

"కేవీఎమ్ రావండీ. అంటే... కే. మండూకవర్ధనరావు"

"మండూకవర్ధనరావు! చిత్రమైన పేరు" అన్నాడు మరో సభ్యుడు చిన్నగా నవ్వి.

ఇంటర్వ్యూ బోర్డు చెయిర్‌మేన్ ఓసారి తలెత్తి చూసి- "ఈ పేరు ఈమధ్యనే ఎక్కడో విన్నాను. ఆ! గుర్తొచ్చింది. హైదరాబాదులో ఉన్న కుంచితపాదం గారు నీకు బంధువు కదూ! అదే. ఆర్థిక శాఖలో జాయింట్ సెక్రటరీగా ఉన్నారు" అన్నాడు.

"అవునండీ! వారి అమ్మాయి నా భార్య" అన్నాడు మ.వ.రావు.

అతని బయోడేటా ఫార్మ్ చూస్తూనే ఇంటర్వ్యూ బోర్డు చెయిర్‌మేన్ ఒక స్లిప్ మీద ఏదో రాసి మిగిలిన ఇద్దరు సభ్యులకీ చూపించాడు. ఆ ఇద్దరూ తలలూపారు తమ ఆమోదం తెలుపుతూ.

"కుంచితపాదం గారు రాష్ట్రస్థాయిలో మనకి చాలా సహాయం చేస్తున్నారు" అన్నాడు చెయిర్‌మేన్ మిగతా సభ్యులతో.

"మరే!" అన్నారు మిగతా సభ్యులు.

"ఇక నిన్నడగవలసినవేమీ లేవోయ్. నువ్వెళ్లవచ్చు. ప్రమోషన్ వచ్చాక ఈ పరిసరాల్లో ఉంటావా? వేరెక్కడికైనా వెళ్తావా?" అన్నాడు చెయిర్‌మేన్.

తను ఆశించిన ప్రశ్నలు రాకపోయేసరికీ నిరుత్సాహపడ్డాడు మ.వ.రావు. "మీ ఇష్టం" అన్నాడు నీరసంగా.

డోర్ తెరుచుకుని బయటకు రాగానే మిగిలిన అభ్యర్థులందరూ "ఏం అడిగారు" అంటూ మూకుమ్మడిగా దాడి చేశారు.

ఏమీ అడగలేదని వాళ్లని తప్పించుకుని బయటపడ్డాడు చిరాకుగా ముఖం పెట్టి.

"ఆ ముఖం చూస్తే తెలియడం లేదూ? ఇంటర్వ్యూ తగలెట్టినట్టున్నాడు" అంటున్నారెవరో వెనక నుంచి.

మ.వ.రావు మనసు మనసులో లేదు. ఈ ఇంటర్వ్యూ కోసం ఎంతగానో శ్రమించాడు. ప్రమోషన్ రావడం ఖాయమని తెలిసినా అతడికి సంతోషంగా లేదు. మామగారి పలుకుబడి తను ప్రమోషన్ సాధించడంలో తృప్తి మిగల్చకుండా చేసింది. ఆ మాటే భార్యతో అంటే, "అదేమిటండీ, అలా ఫీలైపోతున్నారు? ఈ ప్రమోషన్లు తెచ్చుకోడానికి ఎంత మంది ఎగబడడం లేదు సిఫార్సుల కోసం? అయినా మీరేమీ కోరి సిఫారసు చేయించుకున్నారు కనుకనా? మా నాన్నగారు మీ వాళ్లకి ఉపకారం చేస్తున్నారు. దానికి ప్రతిఫలంగా వాళ్లీ ప్రమోషనిచ్చారు. అంతే" అంది కుచలకుమారి ఇది మామూలు విషయమేనని తేల్చేస్తూ.

"స్వయం ప్రతిభతో ప్రమోషన్ తెచ్చుకోవాలి కానీ ఎవరి పలుకుబడి వలనో వచ్చిన ప్రమోషన్ ఏం తృప్తినిస్తుంది చెప్పు?" అన్నాడు మ.వ.రావు గుంభనంగా.

అతడివైపు విచిత్రంగా చూసింది కుచలకుమారి. అవును మరి! సిఫార్సుల నిచ్చెనలు పట్టుకుని ఎదిగిపోతున్న వాళ్లు 'బ్రతకనేర్చిన వాళ్ల'నిపించుకుంటూంటే నిఖార్సయిన స్వయంప్రతిభతో నెగ్గుకు రావాలనుకునే

వాళ్లు బ్రతుకులీడుస్తున్న వాళ్లుగానే మి[illegible]పోతున్నారు లోకంలో!

* * *

ఆరోజు పొద్దున్నే మంచి మ.వ.రావు ప్రమోషనార్డరు వచ్చింది. స్టాఫందరూ వచ్చి మ.వ.రావుని అభినందించారు. అందరికీ కూల్‌డ్రింక్స్ తెప్పించాక మ.వ.రావు. అతను మాత్రం ఉల్లాసంగా లేడు. బ్రాంచి [illegible]శాక ఇంటి కెళ్లకుండా పార్క్‌కి వెళ్లి కూర్చున్నారు.

పార్కులో ఆనందరావు మాస్టారు కనిపించారు. అతను రిటైర్డ్ టీచర్. పెన్షన్ తీసుకోవడానికి బ్యాంక్‌కి వస్తుంటారు. సీనియర్ సిటిజెన్లంటే మ.వ.రావుకి వల్లమాలిన గౌరవం. అందులో టీచర్లంటే మరీ!

"ఏం బాబూ, ఇదేలా ఉన్నావ్?" ఆప్యాయంగానే పలకరించారు.

"ఏం లేదు మాస్టారూ. నాకు ప్రమోషనొచ్చింది" అన్నాడు ఎదురుగా ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తూ.

"దానికి సంతోషించాలి కాని దిగులుపడతావెందుకూ?"

ప్రమోషనెలా వచ్చిందో చెప్పాడు.

"నీలోని అంతర్మథనం అర్థం చేసుకోగలను. కానీ నీ యోగ్యతలబట్టే నీకిచ్చుంటారు ప్రమోషన్. బాధపడకు. నువ్వు అన్ని విధాలా అర్హుడివి" అన్నారు మాస్టారు మ.వ.రావుని మనసులోనే మెచ్చుకుంటూ.

"ఆ అబ్బాయిని చూడండి మాస్టారూ" అన్నాడు మ.వ.రావు ఎదుట జారుడుబల్ల ఎక్కుతున్న నాలుగేళ్ల పిల్లాడ్ని చూపిస్తూ.

మాస్టారు అటువైపు చూశారు.

ఆ అబ్బాయి కష్టపడుతూ నిచ్చెన ఎక్కుతున్నాడు. ఇంకా ఎక్కడానికి రెండు మెట్లున్నాయి. ఎక్కడానికి ప్రయత్నిస్తున్నాడుగానీ ఎక్కలేకపోతున్నాడు. ఆ పిల్లాడి తండ్రి కాబోలు రెండు చేతుల్తో ఎత్తుకుని ఆ పిల్లాడిని చివరి మెట్టెక్కించి జారేలా చేశాడు. ద[illegible]కా పిల్లాడు మారాం చేస్తున్నాడు 'ఎందుకెక్కించావ[illegible]ా'. ఈసారి ఎక్కించవద్దని చెప్పి తన మట్టుకు తానే మళ్లీ ఎక్కడం ప్రారంభించి చివరి మెట్టెక్కి విజయగర్వంతో తండ్రిని చూశాడు. కేరింతలు కొడుతూ జారేడు.

"చూడండి మాస్టారూ, ఆ పసివాడిలో ఎంత పట్టుదలుందో? తనమట్టుకు తానే ఎక్కినందుకు ఎంత సంబరపడిపోతున్నాడో? అటువంటి ఆనందం నాకు కావాలనుకున్నాను. కానీ అలా జరగలేదు" అన్నాడు మ.వ.రావు నిర్లిప్తంగా.

మాస్టారు మ.వ.రావు భుజం తట్టి, "బాధపడకు బాబూ. అసలు ఈ కాలంలో ఉండవలసిన వాడివి కాదు నువ్వు" అన్నారు.

* * *

మ.వ.రావు పార్క్ నుంచి ఇల్లు చేరేసరికి చీకటి పడింది.

"నాన్నగారు వచ్చారండీ" అంది కువలకుమారి గుమ్మంలోనే ఎదురై.

"ఏం బాబూ, బాగున్నావా? ప్రమోషనార్డరు వచ్చిందా?" అన్నారు మామగారు ఇంట్లోకి అడుగుపెట్టగానే.

"ఆ! ఈరోజే వచ్చింది" అన్నాడు మ.వ.రావు ఆయనకెదురుగా కూచుని జోళ్లు విప్పుకుంటూ.

"వెరీగుడ్! కంగ్రాచ్యులేషన్స్"

"నా ప్రతిభతో వచ్చిన ప్రమోషన్ కాదిది. మీ పలుకుబడి వలన వచ్చినది" అన్నాడు మ.వ.రావు మామగారిని అప్రసన్నంగా చూస్తూ.



"విషయం అంతా అమ్మాయి చెప్పింది. నువ్వూ నీ మనస్తత్వం చూసి నేనెప్పుడూ గర్వపడుతూంటాను. నిన్ను బాధ పెడుతూ నేనెందుకు సిఫార్సు చేస్తాను చెప్పు? ఏదో మాటల సందర్భంలో నీ ప్రమోషన్ ప్రస్తావన వచ్చింది ఆమధ్య మీ జి.యం.చాంబర్లో. 'మావాడి పెర్ఫార్మెన్స్ చూసి ఇవ్వండి కానీ నన్ను చూసి మాత్రం వద్దు' అని నిక్కచ్చిగా చెప్పాను" అన్నారు కుంచితపాదంగారు.

"మరి ఇంటర్వ్యూలో ప్రశ్నలేవీ అడగనే లేదు" అన్నాడు మండూకవర్ధనరావు అయోమయంగా ముఖంపెట్టి.

"దానిక్కారణం చెప్తాను, విను" అన్నారు కుంచితపాదంగారు.

కుతూహలంగా చూశాడు మ.వ.రావు.

"ఈ ప్రమోషన్‌కి డెబ్బయి మార్కులు రాత పరీక్షకీ, ముప్ఫయి మార్కులు ఇంటర్వ్యూకీ ఉంటాయట. రెండు మార్కులూ జోడించి మెరిట్ ప్రకారం ప్రమోషనిస్తారట. నీకు రాతపరీక్షలో డెబ్బయికి అరవై ఎనిమిది వచ్చాయిట. టాప్ మార్కు నీదే! నీ తర్వాత మార్కు నలభై మూడట. అంటే వ్యత్యాసం ఇరవై ఐదు మార్కులన్నమాట. ఇంటర్వ్యూలో ముప్ఫయికి ఇరవైకంటే ఎక్కువ ఇవ్వరట ఎవరికీ. ఇంటర్వ్యూ మార్కులు కూడా రాతపరీక్షలో తెచ్చేసుకున్నావు నువ్వు. ఇంటర్వ్యూలో ఏమీ చెప్పకపోయినా మెరిట్ లిస్టులో నువ్వే టాప్‌లో ఉంటావన్నారు. అందుకే నిన్నేమీ ప్రశ్నలడిగి ఉండరు. కాబట్టి ఈ ప్రమోషన్ నీ ప్రతిభ వలన వచ్చినదే కానీ నా పలుకుబడి వలన వచ్చింది ఎంత మాత్రమూ కాదు" అంటున్న మామగారి మాటలకి ప్రమోషన్ వచ్చిన తృప్తిని మొట్టమొదటిసారిగా అనుభవించాడు మండూకవర్ధనరావు!

ఎమ్మెస్వీ గంగరాజు